# 4. మహారాజయోగం

ఉత్తర భారతంలోని అల్వార్ సంస్థానాన్ని సెవాయ్ జయసింగ్ మహారాజావారు పాలిస్తూన్న పుణ్యకాలంలో......

బొంబాయి మహానగరంలో దేశ విఖ్యాతినందిన అలస్టర్ అనే జోతిష్యుడుండేవాడు.

ఆయనగారు గొప్ప గొప్పవారికి మాత్రమే జాతకాలుచూసే వ్రాసే, హైక్లాస్ జోతిష్యులు. రాజ గృహాలకు మాత్రమే అతిధిగా వెళ్ళే రాజ యోగి.

ఆయన చెప్పిన జోస్యాలనేకం వడ్లగింజలో ఉండేది బియ్యపుగింజే నన్నంత స్పష్టాతి స్పష్టంగా నిజమయిన దాఖలాలు అందరికీ తెలుసు. వారి ఆదాయాన్ని అంచనా వేయటం కష్టం. వారికి బొంబాయితోనూ మరికొన్ని నగరాలతోనూ దివ్య హర్మ్యాలున్నాయి.

ఆ రోజుల్లో కారుండటమే ఓ గొప్ప కాగా మనజ్యోతిష్యుల వారికి మూడు కార్లుండేవి

ఎక్కడికి వెళ్ళినా మామూలు రాజులూ మహారాజులూ కూడా రాజోచిత లాంఛనాలతో స్వాగతమిచ్చి, సత్కరించి, జోస్యం చెప్పించుకుని ధన్యులయేవారు. ఇంతగొప్ప జ్యోతిష్యుని దర్శనాపేక్షులై సెవాయ్ జయసింగ్ మహారాజావారు ఓసుముహూర్తాన కబురంపగా...

అల్వారులో ఉన్నన్ని రోజులూ రోజుకు వేయిరూయల ఫీజూ రానూ పోనూ ఓ ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటుకయ్యే ఛార్జీలూ, ఉచిత వసతి

సౌకర్యాలూ ఆదిగాగల చిల్లర ఖర్చులన్నీ రాజావారు భరించవలసి ఉంటుందని జ్యోతిష్యులవారు సెలవిచ్చేరు.

మహారాజావారికిదో పెద్దఖర్చా ః కనుక సాధ్యమయినంత త్వరలో అల్వార్ దయచేయ వలసిందిగా వారు జ్యోతిష్యుల వారికి టెలిగ్రాం పంపేరు.

జ్యోతిష్యుల వారున్నూ ఫలానా ట్రయిన్‌లో వస్తున్నానని ఓ టెలిగ్రాం ఇచ్చి తక్షణం బయలుదేరి ఓ సుదినాన సంధ్యవేళ అల్వార్ స్టేషన్లో వామపాదాన్ని మోపేరు.

వారికి ఆఊరే క్రొత్త. అందుకని అలవాటు ప్రకారం తనకు స్వాగత మిచ్చేందుకు రాజోద్యోగులెవరేనా వస్తారేమోనని నిరీక్షించేరు గానీ కనీసం దారి చూపేందుకేనా అక్కడెవరూ దొరకలేదు. అలా ఎదురు చూసి, చూసి, ఇహ ఇలా కాదనుకుని తానే బయలుదేరి ఓ అరమైలు నడవగా ఓ డొక్కు గుర్రానికి తగిలించి ఉన్న తుక్కు జట్కా ఒకటి ఎదురైతే — ఖరీదయిన కార్లలో మాత్రమే తిరిగేందుకు అలవాటు పడిఉన్న మన జ్యోతిష్యుడుగారు చేసేది లేక ఆ జట్కానే కుదుర్చుకుని ఎలాగోలా మహారాజావారి అతిథి గృహానికి చేరుకున్నారు. చేరుకుని, తననాహ్వానిస్తూ రాజావారు పంపిన టెలిగ్రాం అక్కడి ఉద్యోగులకు చూపగా — వారు "అయ్యా, తమసంగతి మాకెవరూ చెప్పనూలేదు. తమకిక్కడ బస ఏర్పాటు చేయమని మాకెవరూ అదేశమివ్వనూ లేదు. మహారాజావారి అనుమతి లేకుండా ఎవర్ని ఈ గుమ్మందాటి రానిచ్చినా మా ఉద్యోగాలు ఊడకుండానూ ఉండవు. కనుక దయిచెయ్యండి" అని వీడ్కోలిచ్చి పంపేశారు.

ఎక్కడికి వెళ్లినా అదేరకం జవాబు రావటంతో మన జ్యోతిష్యుల వారికి విసుగెత్తి, ఒళ్ళుమండి ఆ రాత్రి నెలాగో గడిపేసి, మర్నాడుద

యమే మహారాజావారి ప్రైవేట్ సెక్రటరీని కలుసుకోగా....

"అయ్యా, మీగురించి మహారాజావారు మాకేమీ సెలవియ్యనూ లేదు. మేమిప్పుడు వెళ్లి సెలవిచ్చుకోగల స్థితిలోనూ లేము. మీ టెలిగ్రాం వారికెలానూ అందింది గనుక వారే స్వయంగా కబురుచేయటం ఖాయం. అందువల్ల మీరు ఉన్నచోటునే ఉండి ఎదురు చూడటం మర్యాద" అని సెలవిచ్చేడు.

మన జ్యోతిష్యుల వారికి ఇదంతా చాలా అసందర్భంగానూ, ఆశ్చర్యకరంగానూ, తుగ్లకిజంగానూ కనిపించింది అయినా వారు తెలివైనవారు గనుకా, అనేకానేకా స్థానానుభవ పారంగతులు గనుకా తొందర పడగూడదని నిశ్చయించుకుని ఆస్థానోద్యోగులనూ, మంత్రులనూ, చివరికి రాజభవన పరిచారకులనూ కూడా పట్టుకుని ఎలాగైనా మహారాజావారికి తన రాకను గురించి తెలిపి, వారి దర్శనం జరిగేలా చూడమనీ, వారి ఋణం ఉంచుకోననీ బ్రతిమాలుకున్నారు.

అయినా వారి ప్రయత్నాలేవీ ఫలించక పోవటంతో చివరికి విసుగెత్తి మూటా ముల్లే సర్దుకుని తిరుగు ప్రయాణానికై రైల్వే స్టేషన్ చేరుకోగా...

సరిగ్గా బొంబాయి వెళ్ళే రైలు వచ్చే సమయానికల్లా యమభటుల్లాంటి నలుగురు రాజభటులు వచ్చి మనజ్యోతిష్యుడు గారిని సగౌరవంగా తలో కాలూ, చెయ్యీ పుచ్చుకుని లాక్కెళ్లి ఓ చీకటి కొట్లో పడేసి తాళం వేసేరు.

దీనితో మన జ్యోతిష్యుడు గారికి దాదాపు పిచ్చెక్కినంత పనయింది. ఈ అల్వార్ సంస్థానమే ఓ పెద్ద పిచ్చాసుపత్రిలా ఉందని తమకు తామే చెప్పుకుని తన దురవస్థకు మౌనంగా రోదించేరు.

మహారాజా వారి దర్శనభాగ్యం పొందాలనీ బయటి ప్రపంచంతో సంబంధాలు పెట్టుకోవాలనీ బొంబాయిలోని తనవారికి తన దురవస్తను గురించి తెలిపి వారి సాయంతో నయినా బయట పడాలనీ చేసిన ప్రయత్నాలన్నీ దురదృష్టవంతుడి అదృష్టంలా వమ్మకాగా మన జ్యోతిష్యుడు గారా చీకటికొట్లో దిక్కులేని స్థితిలో నాలుగు మాసాల పాటు గడిపేసేరు.

నాలుగు మాసాలు......నూట ఇరవై రోజులు...రోజుకు వేయి చొప్పున మొత్తం లక్షా ఇరవై వేల రూపాయల నష్టం అనీ, నష్టం సంగతి దేవుడెరుగు, కనీసం ఈ బందిఖానానుండి బయటపడి బ్రతికేదెన్నటికి ? అనీ అనుకుంటూ మనోవేదనతో జ్యోతిష్యుడుగారు చిక్కి సగంలో సగమైపోయేరు.

అలాంటి స్థితిలో సరిగ్గా నూట ఇరవై ఒకటో రోజున అల్వార్ సంస్థాన పోలీసు శాఖాధికారి స్వయంగా ఆ జైలుకువిచ్చేసి జ్యోతిష్యుల వారిని దర్శించి జరిగిన పొరపాటుకూ, శ్రీవారికి వాటిల్లిన ఇబ్బందికీ సంతాపం వెలిబుచ్చినవారై...

మహారాజా సెవాయ్ జయసింహులవారు ప్రస్తుతం తీరికగా ఉన్నారనీ, జ్యోతిష్యులవారి దర్శనాపేక్షులై వేచి ఉన్నారనీ విన్నవించుకున్నారు.

మన జ్యోతిష్యులవారున్నూ తన పూజలెల్ల ఫలించి, ఈ చీకటి కూపంనుండి విముక్తి లభించినందుకూ, ఈ పిచ్చివాళ్ళ సంస్థానంనుండి స్వస్థలం చేరబోతున్నందుకూ ఆనందించి...శుభ్రంగా క్షవరం చేయించుకుని, పన్నీట జలకమాడి, రాజోచిత వస్త్రాభరణాలు ధరించి ఆస్థానానికేగారు.

దర్బారులో రాజపరివారం మధ్య స్వర్ణసింహాసనంపై సూర్యునిలా వెలిగిపోతూన్న మహారాజావారు చిరునగవుతో స్వాగతమివ్వగా మన జ్యోతిష్యులవారు వినమ్రులై . . .

మహారాజాధిరాజా, మీ రేకార్యార్థమై నన్ను రప్పించారో ఆ విధిని నిర్వర్తించేందుకూ, మీ భవిష్యత్తునూ, జీవితక్రమాన్నీ వివరించేందుకూ నేనిప్పటికీ సిద్ధంగానే ఉన్నాను.

"కాని, రాజేంద్రా...

"మీ ఆహ్వానంపై ఇక్కడికొచ్చిన నేను మీ సంస్థానంలో ఆతిధ్యానికి నోచుకోకపోగా, ఇన్ని బాధలకూ, అవమానాలకూ గురై నాలుగు మాసాలపాటు నా కాలాన్నిక్కడ వృధాగా చీకటికొట్లో గడపవలసి రావటాన్ని మాత్రం నేనేవిధంగానూ అర్థం జేసుకోలేకుండా ఉన్నాను" అని విన్నవించుకోగా...

ఇదేమీ ఎరుగని సభాసదు లెల్లరూ ఆశ్చర్య చకితులై, మొగా మొగాలు చూసుకుంటూ జ్యోతిష్యునిపట్ల జరిగిన మహాపచారానికి కించ పడుతూన్న క్షణాన, మహారాజా సెవాయ్ జయసింహులవారు మేరు గంభీరస్వరంతో ఇలా ప్రవచించేరు.

"మహానుభావా, నేను నీచేత జోస్యం చెప్పించుకో దలచలేదు...

"నీ విక్కడకు బయలుదేరేముందు నీకోసం ఇక్కడ ఎదురు చూస్తున్న సన్మానం ఎటువంటిదై ఉంటుందోననే అల్ప విషయాన్ని కూడా అంచనా వేసుకోలేని అసమర్థుడవు నీవు నా భవిష్యత్తును గురించి ఎలా అంచనాలువేసి చెప్పగలవు...?

"కనుక, నీవిక దయచేయ వచ్చును. మానుండి నీకు ఒక్క చిల్లి

గవ్వకూడా ముట్టదుగాక ముట్టదు..."

తల తిరిగి పాతాళంలోకి క్రుంగిపోయిన మన సుప్రసిద్ధ దేశ విఖ్యాత హైక్లాస్ జ్యోతిష్యుడూ, రాజయోగీ అలస్టర్‌గారు త్వరగానే తేరుకుని, తల ఎగిరిపోనందుకు సంతోషిస్తూ స్వంత ఖర్చులతో బొంబాయికి తిరుగుముఖం పట్టేరని వేరే చెప్పాలా !

★